క్లుప్తంగా

రామాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు దొంతగాని అప్పారావు

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని కాపుగల్లులో నూతనంగా చేపట్టిన రామాలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, వ్యాపారవేత్త దొంతగాని అప్పారావు ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం శుక్రవారం రూ.లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఆలయాల అభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బాలేబోయిన పాపారావు, జయరాజు, చంద్రయ్య, నరసింహారావు, రమేష్, వెంకటేశ్వరరావు, నరేష్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు ఏర్పాటు



సిరిపురంలో ఉపాధి హామీ పనుల వద్ద టెంటు ఏర్పాటు చేసిన అధికారులు

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు శుక్రవారం కనీస సౌకర్యాలైన నీడ కోసం టెంట్, తాగు నీరు, ఓఆర్ఎస్ పాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు ఏర్పాటు చేశారు. దీంతో ఆ గ్రామ కూలీలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కా ర్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఆర్.సతీష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు, డెక్కన్ పరిశ్రమ అధికారులు

పాలకవీడు : ఆరోగ్యంపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పరిశ్రమలో మిర్యాలగూడెంకు చెందిన బాలాజీ ఆసుపత్రి వారిచే ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాగా, వైద్య శిబిరానికి పరిశ్రమ పరిధిలోని గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ సీజీఎం నాగమల్లేశ్వరరావు, బాలాజీ హాస్పిటల్ డైరెక్టర్ పోశం సునీత, చిలుకూరి గోపీనాథ్, డాక్టర్లు అభిషేక్, నాగేందర్, నవీన్ కుమార్, ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

వరి కొయ్యలకు నిప్పు పెడితే చర్యలు

నడిగూడెం : ప్రస్తుత వేసవిలో వరి కొయ్యలకు నిప్పు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హేమామాలిని అన్నారు. ఈ నెల 25న కాగితరామచంద్రాపురంలో అగ్ని ప్రమాదం జరిగిన నేపథ్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో రైతులు వరి కొయ్యలకు నిప్పంటించకుండా చైతన్యం చేయాలన్నారు. వరి కొయ్యలను తగులపెడితే భూసారం దెబ్బతింటుందని, పంటల దిగుబడి తగ్గుతుందని రైతులకు తెలియజేయాలన్నారు. అలాగే ఆస్తి, ధన నష్టం జరుగుతుందని చెప్పాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ జి.అజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్, వనిత లెజెండ్ క్లబ్ నూతన కమిటీల ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ వాసవీ క్లబ్, వాసవీ వనిత లెజెండ్ క్లబ్ సభ్యుల సమావేశం శుక్రవారం పట్టణంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయా క్లబ్‌లు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. వాసవీ వనిత లెజెండ్ క్లబ్ అధ్యక్షురాలిగా పబ్బతి స్రవంతి, సెక్రటరీగా చేపూరి వాణి, కోశాధికారిగా తమన సుజాతలను ఎన్నుకున్నారు. అదేవిధంగా వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా ఉప్పల రాంనరేష్, సెక్రెటరీగా చేపూరి నరసింహారావు, కోశాధికారిగా స్వామి గోపిలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం వారిని పలువురు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాచర్ల కమలాకర్, కలకోట లక్ష్మయ్య, పబ్బతి వేణు, మీలా వాసుదేవ్, జూలకంటి నాగరాజు, కలకోట అనిత, వంగవీటి లోకేష్, కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వరరావు, ఊర వెంకయ్య, తమన నాగేశ్వరరావు, స్రవంతి, శృతి, లక్ష్మి, మనీష తదితరులు పాల్గొన్నారు.

దాతలూ.. ఆదుకోండి

- కాలేయ వ్యాధితో బాధపడుతున్న కుమార్తె
- తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- చికిత్సకు రూ.10లక్షలు అవసరం
- రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబం
- దాతల సాయం కోసం ఎదురుచూపులు

కన్నీటి గాథ



హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింధు

మునగాల(కోదాడ): కాలేయ వ్యాధితో బాధపడుతున్న కుమార్తెకు సరైన వైద్యం చేయించలేక తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన కంపసాటి వెంకన్న–అన్నపూర్ణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె సింధు నడిగూడెం మండల కేంద్రంలో గల గురుకుల పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి ఇంటికి చేరుకుంది. ఊహించని విధంగా సింధు పదిరోజుల క్రితం అనారోగ్యం బారిన పడింది. దీంతో కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆమె కాలేయ వ్యాధితో బాధపడుతోందని వైద్యులు గుర్తించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో సింధు తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు చికిత్స కోసం రూ.10లక్షలు అవుతుందని చెప్పడంతో వారు రూ.3లక్షలు అప్పు చేసి ఆస్పత్రిలో చెల్లించారు. వైద్యానికి ఇంకా రూ.7లక్షలు అవసరమున్నందున ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

సాయం చేయాల్సిన వారు సంప్రదించాల్సిన నంబర్లు
కంపసాటి వెంకన్న, ముకుందాపురం
ఎస్‌బీఐ అకౌంట్ నంబర్: 34832031270
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: SBIN0008497
ఫోన్‌పే, గూగుల్‌పే నంబర్: 95532 94527

మూడోసారి బీజేపీదే అధికారం

- నల్లగొండ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి



కోదాడరూరల్ : తమ్మర గ్రామంలో ప్రచారంలో మాట్లాడుతున్న శానంపూడి సైదిరెడ్డి

కోదాడ రూరల్ : కేంద్రంలో మూడోసారి కూడా బీజేపీ అధికారంలోకి రావడం, నరేంద్రమోదీ మరోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆయన లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల నిధులను కేటాయించిందన్నారు. రాష్ట్రంలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది కేంద్ర ప్రభుత్వం నిధులతోనేనని అన్నారు. పదేళ్లలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, అవినీతికి ఆస్కారం లేకుండా సుపరిపాలన అందజేసిన ఘనత ప్రధాని మోదీదేనన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే నల్లగొండ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని నియోజకవర్గాలను మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చాడ శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, కోదాడ కన్వీనర్ కనగాల నారాయణ, నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య, నూనె సులోచన, బండారు కవితారెడ్డి, యశ్వంత్, కిట్టు, శ్రీలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘిస్తే జైలుకెళ్లడం ఖాయం

- సీఐ చరమందరాజు



ఆర్డీఓ శ్రీనివాసులు ఎదుట ఇరువర్గాలను బైండోవర్ చేస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్ : బైండోవర్ ఉల్లంఘించిన వారు జైలుకెళ్లడం ఖాయమని సీఐ చరమందరాజు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గరిడేపల్లి మండలం వెల్దండ గ్రామంలో రాళ్ల దాడికి పాల్పడిన ఇరువర్గాల వారిని శుక్రవారం హుజూర్‌నగర్‌లో ఆర్డీఓ శ్రీనివాసులు ఎదుట 107 సీఆర్‌పీసీ ప్రకారం బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం బైండోవర్ అయిన వారిపై ఏడాది కాలంలో ఏదైనా కేసు నమోదైతే వారు రూ.2 లక్షలు జరిమానా కట్టాల్సి ఉంటుందన్నారు. జరిమానా కట్టనివారు జైలుకెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో గతంలో ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు ఆయా మండలాల తహసీల్దార్ల ఎదుట బైండోవర్ అయినట్లు చెప్పారు. సదరు వ్యక్తులపై ఏడాది కాలంలో ఏదైనా కేసు నమోదైతే రూ.1 లక్ష జరిమానా కడతామని సొంత పూచీకత్తు ఇచ్చారని, కానీ వారిలో 11 మంది బైండోవర్‌ను అధిగమించిన కేసులలో ఉన్నారని తెలిపారు. వారిలో హుజూర్‌నగర్ మండలంలో ఇద్దరు, మఠంపల్లి మండలంలో ఆరుగురు, గరిడేపల్లి మండలంలో ఒకరు, పాలకవీడు మండలంలో ఇద్దరు ఉన్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో గరిడేపల్లి ఎస్ఐ సైదులు ఉన్నారు.

మౌలిక వసతుల పరిశీలన

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలల్లో ఏఏ వసతులు ఉండాలో గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదించి ఏర్పాట్లు చేసేందుకు ప్రత్యేక చర్యలను చేపడతామన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఇన్‌చార్జ్ డీఈ వెంకన్న, మున్సిపల్ ఇన్‌చార్జ్ ఏఈ వినోద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకరమణ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ



బేతవోలులో ఓటర్లకు ఓటరు స్లిప్‌లు అందజేస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ ధ్రువకుమార్

చిలుకూరు : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు అసౌకర్యానికి గురికాకుండా వసతులు కల్పించాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ సూచించారు. చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ బూత్‌లలో తాగునీరు, వీల్‌చైర్స్, అవసరమైన చోట ర్యాంపులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతిఒక్క ఓటరుకు ఓటరు స్లిప్‌లు అందజేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఓటర్లకు ఓటరు స్లిప్‌లను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధ్రువకుమార్, ఆర్ఐ మంత్రిప్రగడ సీతారామచందర్‌రావు, గ్రామ కార్యదర్శి రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రఘువీర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలి



కాంగ్రెస్ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జునరావు

హుజూర్‌నగర్ : నల్లగొండ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రచార రథాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మంత్రి ఉత్తమ్ సారథ్యంలో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కన్నా ఎక్కువ వచ్చే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం ఆవిష్కరణ



వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

చిలుకూరు : మండల కేంద్రం సమీపంలోని కవితా జూనియర్ కళాశాల వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం ఆవిష్కరణ మహోత్సవాన్ని శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మఠాధిపతులు పమ్మి బ్రహ్మయ్యచారి ఆధ్వర్యంలో ఉదయం మంగళతోరణం, విఘ్నేశ్వరపూజ, నవగ్రహ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థల దాత పమ్మి బ్రహ్మయ్యచారి– ఈశ్వరమ్మ దంపతులు, విగ్రహ దాతలు పమ్మి పిచ్చయ్యచారి–గురవమ్మ దంపతులు, పమ్మి ఉపేంద్రచారి, నాగబ్రహ్మచారి, భక్తులు పాల్గొన్నారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



నేరేడుచర్ల : రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న భక్తులు



నేరేడుచర్ల : మూసీఒడ్డుతండాలో ఆంజనేయస్వామి విగ్రహ పతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న భక్తులు

నేరేడుచర్ల : మండలంలోని వైకుంఠపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో దేవతామూర్తుల విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు రామనామ స్మరణతో మార్మోగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమప్పసోమేశ్వరాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ దంపతులు.. భక్తులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు.

శ్రీబాల గురప్ప ఆలయ ప్రతిష్ఠ వేడుకలు..

నడిగూడెం : మండలంలోని రామాపురంలో నూతనంగా నిర్మించిన శ్రీబాల గురప్ప ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద హోమం చేశారు. మహిళలు జలబిందెలతో ప్రదర్శనగా వచ్చి స్వామివారి విగ్రహాలకు జలాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ..

నేరేడుచర్ల : మండలంలోని పులగంబండతండా గ్రామపంచాయతీ పరిధిలోని మూసీఒడ్డుతండాలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్ఐ రవీందర్‌నాయక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామంలో నూతనంగా కనకదుర్గమ్మ దేవాలయం నిర్మించి అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించారు. శుక్రవారం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



చిలుకూరు : నారాయణపురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



నడిగూడెం : రామాపురంలో జలబిందెలతో ఆలయానికి వస్తున్న మహిళలు



నేరేడుచర్ల : విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎస్ఐ రవీందర్‌నాయక్, తదితరులు

కేంద్రానికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైంది



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాములు

హుజూర్‌నగర్ : ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మే డే సన్నాహక సమావేశం జక్కుల రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తున్నదని ఆరోపించారు. మతతత్వ పార్టీలకు బుద్ధి చెప్పేలా కార్మికులు మే డే వేడుకలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కంబాల శ్రీనివాస్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, నాయకులు యల్లావుల రమేష్, దొంతగాని సత్యనారాయణ, సోమగాని కృష్ణ, ఇందిరాల వెంకటేశ్వర్లు, జక్కుల శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, స్వామి, మల్లయ్య పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఎన్నికల్లో ఓడించాలి



మఠంపల్లిలో మాట్లాడుతున్న పాండునాయక్

మఠంపల్లి : పార్లమెంట్ ఎన్నికల్లో దేవుడి పేరు చెప్పి ప్రజలను మోసం చేయాలని చూస్తున్న మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్ కోరారు. శుక్రవారం మఠంపల్లిలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్లుగా ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మఠంపల్లి, మేళ్లచెరువు మండలాల కార్యదర్శులు మాలోతు బాలునాయక్, వట్టిపు సైదులు, సయ్యద్ రస్ మియా, కె.వెంకటరెడ్డి ,తిరుపతయ్య, లింగయ్య, వెంకటరెడ్డి, కోటయ్య, సాంబయ్య, హరియా, రాము, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీవి ప్రజా వ్యతిరేక విధానాలు

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రజా వ్యతిరేక, మతోన్మాద బీజేపీని గద్దె దింపాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అమర వీరుల స్మారక భవనంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలో అవకాశవాద రాజకీయాలు పెరిగిపోతున్నాయని, సంతలో సరుకుల్లా ఓట్లు, సీట్లు కొనుగోలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మతతత్వ రాజకీయ నాయకులను కాకుండా వామపక్ష, ప్రజాతంత్ర లౌకిక శక్తులని ఎంపీ ఎన్నికల్లో గెలిపించే విధంగా ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యులు చందాల భిక్షం, పిన్నపురెడ్డి వెంకటరెడ్డి, వీరస్వామి, వెంకటేశ్వర్లు, నర్సింహచారి, కాశీం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

- ఉప్పల్ స్టేడియంలో క్రీడాభిమానులను చైతన్య పరిచిన చందా శ్రీనివాసరావు



ఉప్పల్ స్టేడియంలో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న చందా శ్రీనివాసరావు

చిలుకూరు : హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో గురువారం జరిగిన ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లో తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల నిర్మూలన చైతన్య కార్యక్రమంలో తాను పాల్గొని స్టేడియంలోని క్రీడాభిమానులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించినట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు చందా శ్రీనివాస్‌రావు శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ప్రతిఒక్కరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. డ్రగ్స్ వాడకంతో అనారోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. స్టేడియంలో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించే అవకాశం తనకు రావడం చాలా సంతోషమని అన్నారు.

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం

సూర్యాపేట : కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు పాలడుగు పరశురాం మాదిగ కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే చరిత్ర కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై ప్రతి ఒక్కరూ కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. ప్రజలంతా ఆశీర్వదించి కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన పాలడుగు పరశురామ్‌తో పాటు పలువురు.. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

కార్మికులకు నష్టం కలిగిస్తున్న కేంద్ర ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న బచ్చలకూరి స్వరాజ్యం

మునగాల : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బచ్చలకూరి స్వరాజ్యం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధ సంఘం) సమావేశం ఆ సంఘం అధ్యక్షుడు షేక్ దస్తగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా స్వరాజ్యం మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను, 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదిస్తూ బీజేపీ ప్రభుత్వం కార్మికులకు నష్టం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు షేక్ పాషా, ఎం.నాగేంద్రబాబు, షేక్ సైదా, కోల ఆంజనేయులు, సురభి రమేష్, అల్లి నాగరాజు పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో గోమాతకు పూజలు



గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం సహస్రనామ కుంకుమార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగం, సేవాకాలం, నవకలశ స్నాపనం, అభిషేకం, అర్చన, వసంతోత్సవం, మంగళాశాసనం, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం గోమాతకు పూజలు చేశారు. సాయంత్రం పుష్పయాగం, దేవతోద్వాసన, ద్వాదశసేవలు, సప్తవర్ణములు, ధ్వజపట ఉద్వాసన ఆరగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై శ్రీనివాసాచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు భిక్షం, నర్సింహారావు, గురవయ్య, వీరబాబు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్

- వృథాగా పోతున్న నీరు



హనుమయ్యగూడెం వద్ద వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

పాలకవీడు : మండలంలోని హనుమయ్యగూడెం, కోమటికుంట గ్రామాల మధ్య మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకై నీరు వృథాగా పోతుంది. దీంతో రోడ్డు వెంట వ్యవసాయ భూముల్లో నీరు నిలిచింది. అసలే ప్రస్తుత వేసవిలో తాగు నీరు అందక ప్రజలు అల్లాడుతుంటే మండలంలో తరచూ పైప్‌లైన్ లీకేజీలు కావడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నాసిరకం పైపులు ఏర్పాటు చేయడంతోనే ఇలా జరుగుతుందని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కబ్జాకు గురైన చెరువు శిఖం భూమి గుర్తింపు

మిర్యాలగూడ : మండలంలోని వెంకటాద్రిపాలెంలో కబ్జాకు గురైన చెరువు శిఖం భూమిపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు శుక్రవారం సర్వే చేపట్టారు. సర్వే నెం.11లో 25.07 ఎకరాల్లో చెరువు శిఖం భూమి ఉండగా అందులో 16 ఎకరాలు కబ్జాకు గురైనట్లు గతంలో ఆ గ్రామానికి చెందిన వ్యక్తి లోకాయుక్తాకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త ఆదేశానుసారం శుక్రవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే చేపట్టారు. కబ్జాకు గురైన 12.32 ఎకరాల భూమిని గుర్తించి ఎఫ్టీఎల్ పెట్టించి ఆ భూమిని రక్షించాలని, రక్షణ కంచె ఏర్పాటు చేసుకోని బోర్డు పెట్టాలని తహసీల్దార్ హరిబాబు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ సర్వేలో ఆర్ఐ రామకృష్ణ, సర్వేయర్ ఖాద్రి, ఇరిగేషన్ ఏఈ రామకృష్ణ తదితరులు ఉన్నారు.